ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 15 జూలై 2025



భూపాలపల్లిలోని జీజీహెచ్

రోగ నిర్ధారణ సులభతరం

- జీజీహెచ్‌కు మహర్దశ
- అందుబాటులోకి రానున్న సిటి స్కాన్
- రూ. 4 కోట్లతో ఏర్పాటుకు సన్నద్ధం
- త్వరలోనే సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)కు మహాహర్దశ పట్టనుంది. పీహెచ్‌సీ నుంచి జీజీహెచ్‌గా అప్‌గ్రేడ్ అయిన ఈ ఆస్పత్రిలో అంతేస్థాయిలో సౌకర్యాలు మెరుగు పడుతున్నాయి. ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న సిటి స్కాన్ సేవలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఈ నెలలోనే దీన్ని ప్రారంభించేం దుకు సిద్ధం చేశారు. జీజీహెచ్‌కు రూ. 4కోట్ల విలువైన సిటిస్కాన్‌ను సీఎస్ఆర్ నిధుల కింద ఈసీఎల్ సంస్థ అందిస్తోంది. దీంతో ఇప్పటికే 12 రకాల వైద్యసేవలతో జిల్లా ప్రజలతో పాటు పెద్దపల్లి, మహారాష్ట్ర ప్రజలకు సేవలు అందిస్తున్న జీజీహెచ్‌లో రానున్న రోజుల్లో మరిన్ని కార్పొరేట్ సేవలు అందనున్నాయి.

అందుబాటులోకి 12 రకాల వైద్య సేవలు

ప్రస్తుతం జీజీహెచ్‌లో 12 రకాల వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయి. అనస్థీషియా, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఈఎన్‌టీ, డెంటల్, పీడియాట్రిషన్, రేడియాలజీ, సైకాలజీ, ఫిజియోథెరపీ, కంటి వైద్య సేవలు అందుతున్నాయి. వీటిలో జనరల్ మెడిసిన్, సర్జరీ, అనస్థీషియా, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిషన్ వంటి సేవలు 24 గంటలు ప్రజలకు అందుతున్నాయి. మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉండటంతో సీనియరిటీ కలిగిన వైద్యులు ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నారు. ప్రొఫెసర్లు అయిన వైద్య నిపుణులు నవీన్ కుమార్, నాగార్జునరెడ్డి, రాజేంద్రప్రసాద్, రఘు, సురేందర్, కవిత, రాజేష్ జీజీహెచ్‌లో అందుబాటులో ఉంటున్నారు. వీరితోపాటు మరో 42 మంది డాక్టర్లు కూడా పనిచేస్తున్నారు. ప్రతి రోజూ 400-500 మందికి ఓపీ సేవలు ఇక్కడ అందుతున్నాయి. వీటితోపాటు మరిన్ని సేవలు ప్రజలకు అందుతున్నాయి. ఆస్పత్రిలో జరిగే డెలవరీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రతినెలా సుమారు 200 కాన్పులు ఇక్కడ జరుగుతున్నాయి. 200-250 సర్జరీలు చేస్తున్నారు. డెలవరీలు, సర్జరీలతోపాటు హైరిస్క్ కేసులను కూడా జీజీహెచ్‌లో చూస్తున్నారు.

ముందుకొచ్చిన ఈసీఎల్

సిటి స్కానింగ్ (కంప్యూటెడ్ టోమోగ్రఫీ) ద్వారా వ్యాధులను నిర్ధారించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నిత్యం 500 కుపైగా ఓపీ నడుస్తున్న జీజీహెచ్‌లో వివిధ వ్యాధుల బారినపడి వైద్యం కోసం ఎంతో మంది వస్తుంటారు. ఇందులో కొంతమంది రోగుల వ్యాధి నిర్ధారణ కోసం సిటి స్కానింగ్ తప్పనిసరి కావడంతో జీజీహెచ్‌లో దీని సేవలు అత్యవసరమయ్యాయి. దీంతో సిటి స్కానింగ్ ఏర్పాటుకు వైద్యులు ప్రతిపాదనలు పంపారు. ఈ మిషన్‌ను కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్) నిధుల నుంచి రూ. 4 కోట్లను ఈసీఐఎల్ కంపెనీ సమకూర్చుతోంది. 32 స్లైస్ సామర్థ్యం ఉన్న ఈ యంత్రం ఐదు నిమిషాలకోసారి స్కానింగ్ తీస్తుంది. తల నుంచి కాళ్ల వరకు స్కానింగ్ చేసి వ్యాధిని నిర్ధారిస్తుంది. నెలకు 200 వరకు స్కానింగ్‌లు తీసే సామర్థ్యాన్ని ఇది కలిగి ఉంది. జీజీహెచ్‌లో ప్రతి రోజూ సగటున ఐదు చొప్పున నెలకు 150 కేసులు సిటి స్కానింగ్ అవసరాన్ని కలిగి ఉంటున్నాయి. ఇక్కడ ఇది అందుబాటులో లేకపోవడం వల్ల వైద్యులు బయటకు రిఫర్ చేస్తున్నారు. దీంతో రోగులకు రూ. 2,500 చార్జ్ పడుతోంది. అదే జీజీహెచ్‌లో సిటి స్కాన్ అందుబాటులోకి వస్తే రోగులకు ఆర్థిక భారంతో పాటు వరంగల్, హనుమకొండ వెళ్లకుండా దూరభారం కూడా తగ్గుతుంది.

సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం!

జీజీహెచ్‌లో సిటి స్కాన్ సేవలను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆస్పత్రి సముదాయం లోని తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ భవనంలో ఈ సౌకర్యాన్ని అందు బాటులోకి తెస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌లో అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. సిటి స్కాన్‌ను అందిస్తున్న ఈసీఎల్ సంస్థ ఇంజనీర్లు ఆస్పత్రిని సందర్శించి దీని ఏర్పాటు చేసేందుకు సౌకర్యాలను పరిశీలించారు. సిటి స్కాన్ సేవలను ఈనెలాఖరులోగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో మరికొన్ని అధికార కార్యక్రమాలు ఉండటంతో వాటితో (మిగతా 8వ పేజీలో)

త్వరలోనే ప్రారంభిస్తాం

- రాహుల్ శర్మ, కలెక్టర్



జీజీహెచ్‌లో సిటి స్కాన్ సేవలను ఈనెలాఖరులోగా ప్రారంభిస్తాం. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశాం. సిటి స్కాన్ అందిస్తున్న ఈసీఎల్ సంస్థ ప్రతినిధుల కూడా వసతుల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో జీజీహెచ్ కేంద్రంగా ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలను అందిస్తాం.

మహిళా సాధికారతే లక్ష్యం

- స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, బీమా చెక్కుల పంపిణీ



జిల్లా సమాఖ్యకు రూ.10.30కోట్ల చెక్కు ఇస్తున్న మంత్రి

కాటారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్‌లో డివిజన్ పరిధిలోని ఐదు మండలాల మండల, గ్రామైక్య సంఘాల మహిళలకు డీఆర్‌డీఏ ద్వారా వడ్డీ లేని రుణాలు, ప్రమాద బీమా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా సమాఖ్య ప్రతినిధులకు 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు మొదటి విడతలో మంజూరైన వడ్డీ లేని రుణాల నగదు రూ.10.30కోట్ల విలువ చేసే చెక్కును కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌డీవో బాలకృష్ణతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు అందజేశారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల సమాఖ్యలకు రూ.69.03లక్షల చెక్కు, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు లోన్, ప్రమాద బీమా కింద మంజూరైన రూ.36,34,751 చెక్కులు, ఆత్మహత్య చేసుకున్న ఏడుగురు రైతుల కుటుంబాలకు మంజూరైన పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 10ఏళ్ల వడ్డీ లేని రుణాల డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు. ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక మహిళా సంఘాల బలోపేతం కోసం విశేష కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది కాలంలో మహిళల కోసం రూ.21వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రుణాలు సద్వినియోగం చేసుకుని మహిళలు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని ఆకాంక్షించారు. మహిళలు ఏ వస్తువును ఉత్పత్తి చేసినా మార్కెటింగ్ జరిగేలా పరిశ్రమల శాఖ మంత్రిగా కృషి చేస్తానన్నారు. త్వరలోనే కాటారం డివిజన్ పరిధిలో ప్రతి మండలానికీ 100 మంది చొప్పున మహిళలను ఎంపికచేసి ఉషా కుట్టు మిషన్ల కంపెనీ ఆధ్వర్యంలో శిక్షణను అందించనున్నట్టు తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో 400 కుట్టు మిషన్లు కంపెనీ అందించేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసి పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఆర్‌డీవో బాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు ప్రశాంత్, మొండయ్య, జిల్లా, మండల సమాఖ్య అధ్యక్షులు సరిత, పర్జానా బేగం, రజిత, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

హుండీల చోరీ కేసులో ఒకరి అరెస్టు

ఏటూరునాగారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా ఆలయం, రామన్నగూడెం శివాలయంలో ఇటీవల జరిగిన హుండీ దొంగతనాల కేసులో ఓ వ్యక్తిని ఏటూరునాగారం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీసీకెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. దొంగిలించిన నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ అనుముల శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అటువైపుగా వస్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతడిని పట్టుకొని విచారించగా, ఏటూరునాగారం, రామన్నగూడెం ఆలయాల్లో హుండీ దొంగతనాలు అతడే చేసినట్లు వెల్లడైందని సీఐ పేర్కొన్నారు. తాడ్వాయి మండల వీరాపూర్ గ్రామానికి చెందిన చేలా సందీప్(33)గా అతడిని గుర్తించామని తెలిపారు. అతడి వద్ద నుంచి రూ. 1,100 నగదును రికవరీ చేసినట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఎస్సై ఎన్. రాజ్‌కుమార్, కానిస్టేబుళ్లు సదానందం, హరీశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం బ్యారేజీలోకి 1.75 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా నీటి మట్టం 3మీటర్లుగా ఉంది. దీంతో బ్యారేజీలోని 85 గేట్లను ఎత్తి, దిగువకు అంతే నీటిని పంపిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

గణపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం శంకుస్థాపన చేశారు. బస్వరాజుపల్లి, గొల్లపల్లి, ధర్మరావుపేట గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 52లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల అభివృద్ధే ధ్యేయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

వెంకటాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోదావరిలంకలో పేకాట ఆడుతున్న పది మందిని స్థానిక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గోదావరి లంకల్లో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడిచేసి పదిమందిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

మొరం తవ్వకాలు అరికట్టాలి : ఎమ్మార్పీఎస్

టేకుమట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విచ్చల విడిగా జరుగుతున్న అక్రమ మొరం తవ్వకాలను అరికట్టాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ప్రతి రోజూ చెరువుల నుంచి అక్రమంగా మొరం తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో పడి అక్రమార్కులకు సహకరిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రేణుకుంట్ల రాము, ఆకినెల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన ఉండేది కమ్యూనిస్టులే..

- ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ సీపీఐ
- కాంగ్రెస్, బీజేపీ దేశ పొలిమేర దాటితే కనబడవు
- మావోయిస్టులను అంతం చేయడం సరికాదు..
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

కృష్ణకాలనీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన నిలబడి హక్కుల సాధన కోసం ఉద్యమించేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ సీపీఐ ఒక్కటి మాత్రమేనని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు దేశ పొలిమేర దాటితే ఉండవని వ్యాఖ్యానించారు. సీపీఐ ఐదో జిల్లాస్థాయి మహాసభల సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం బహిరంగ సభ జరిగింది. బహిరంగ సభకు ముందు 5 ఇన్‌క్లైన్ కమాన్ నుంచి భారీ ర్యాలీని నిర్వహించారు. బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ సీపీఐ పార్టీ చైనా, అమెరికా, శ్రీలంక, నేపాల్‌లో సైతం ఉందని తెలిపారు. పేదల అభ్యున్నతే తమ పార్టీ ధ్యేయమన్నారు. పాలకులు కుర్చీ ఎక్కేంత వరకే హామీలు ఇస్తారని, ఆ తర్వాత వాటిని విస్మరిస్తారని అన్నారు. గత పాలకుల్లాగానే నేటి పాలకులూ ఉన్నారని వ్యాఖ్యానించారు. అధికారం ఉన్నా లేకపోయినా అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన సిబ్బంది, జెన్‌కో ఆర్టిజన్లు, సింగరేణి ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల కార్మిక లోకానికి వెన్నుదన్నుగా సీపీఐ ఉంటోందన్నారు.

పాకిస్తాన్ ఉగ్రవాదంపై అమిత్‌షా ఎందుకు మాట్లాడరు

మావోయిస్టులను ఏరివేస్తామని అంటున్న కేంద్ర మంత్రి అమిత్‌షా పాకిస్తాన్‌లో ఉగ్రవాదులను లేకుండా చేస్తామని ఎందుకు ప్రకటన చేయలేకపోతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. సీపీఐ ఐదో జిల్లాస్థాయి మహాసభల సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ మావోయిస్టులు కమ్యూనిస్టులేనన్నారు. విడిపోయి మావోయిస్టులుగా మారారన్నారు. వారిని అంతం చేయడం సరికాదన్నారు. ఏవరైనా తప్పు చేస్తే చట్టప్రకారంగా శిక్షించాలన్నారు. కాంగ్రెస్‌తో స్నేహం ఉన్నప్పటికీ పేదల హక్కుల సాధన కోసం అధికారంలో ఉన్న ఆపార్టీపై పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాస్త మంచివాడేనని, ప్రభుత్వ జాగాలో ఇళ్లు నిర్మించుకున్న వారికి బోర్లు వేయించారని కొనియాడారు. మరింత చొరవ తీసుకొని పక్కాఇళ్లు నిర్మించే ప్రయత్నం చేయాలని కోరారు. సాధారణంగా ఎక్కడైనా ఎమ్మెల్యేలు పేదల గుడిసెలు తీసేయాలనే ఆలోచన చేస్తారని, ఇక్కడి ఎమ్మెల్యే మాత్రం అలా చేయలేదని, ఆ విషయంలో ఆయనకు అభినందిస్తున్నట్టు తెలిపారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిన ఘనత సీపీఐదేనన్నారు. చెల్పూరులో జెన్‌కో ఏర్పాటు చేయాలని ఆనాడు పాదయాత్ర చేసిన చరిత్ర సీపీఐకి ఉందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటలకే పరిమితం అవుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ శాంతి, సుధాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కొరిమి సుగుణ, క్యాతరాజు సతీష్, సోత్కు ప్రవీణ్‌కుమార్, రాంచంద్రయ్య, పోషం, జోసెఫ్, పి.రవి, గోలి లావణ్య పాల్గొన్నారు.

ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీలు

పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్



ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ఏటూరునాగారం రూరల్, జూలై14 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖ దాడులను ఆపి, పోడు భూములకు హక్కు పత్రాలు అందించాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ కార్యాలయాన్ని ఆదివాసీలు సోమవారం ముట్టడించారు. దీనికి ముందు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి ఐటీడీఏ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రవికుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోడు సాగుదారులపై అటవీ శాఖ దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అటవీ శాఖ అధికారులు పద్ధతిని మార్చుకోకపోతే గిరిజనుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనుల హక్కులను కాలరాస్తూ వారిని అటవీ నుంచి దూరం చేయాలనే కుట్రలో భాగంగానే ప్రభుత్వం జీవో 49ను తీసుకొచ్చిందని విమర్శించారు. జీవో 3ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వలస ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలని, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని అన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు దుగ్గి చిరంజీవి, గొంది రాజేష్, జజ్జరి దామోదర్, పూనెం నగేష్, కురుసం చిరంజీవి, శాంతకుమారి, శ్రీను, అల్లం అశోక్, తోలెం కృష్ణయ్య, కృష్ణారావు, కారం నాగేశ్వరరావు, సాయం కుమారి, విజయ్‌తోపాటు సుమారు 400 మంది పాల్గొన్నారు.



నల్లబెల్లిలో యూరియా గోదాం వద్ద విచారణ చేస్తున్న అధికారులు

యూరియా నిల్వలు.. రైతుల అవస్థలు

ఫర్టిలైజర్ షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు

నల్లబెల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను, గోదాంలను ఏడీఏ దామోదర్‌రెడ్డి, ఏవో రజిత, ఎస్సై గోవర్ధన్‌లు సోమవారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని కర్ర మల్లారెడ్డి ఫర్టిలైజర్ షాపులో రిజిష్టర్‌ను ఏడీఏ పరిశీలించారు. అనంతరం గోదాం వద్దకు వెళ్లి పరిశీలించారు. గోదాంలో 1286 యూరియా బస్తాలను నిల్వ ఉంచినందున ఫర్టిలైజర్ షాపు యజమాని కర్ర కృష్ణారెడ్డిపై 6 ఏ కేసు నమోదు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలియజేశారు. రైతులకు యూరియాను అమ్మకుండా గోదాంల్లో నిల్వ ఉంచే ఫర్టిలైజర్ షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ తెలిపారు. డీలర్లు యూరియాను రైతులకు అమ్మకుండా నిల్వ ఉంచుతుంటే అధికారులు ఏమి చేస్తున్నారని రైతులు నిలదీశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి రంగంలోకి దిగి నల్లబెల్లిలో నిల్వ ఉన్న యూరియా బస్తాలను రైతులకు ఇప్పించాలని రైతులు కోరారు.

మృతికి కారణమైన ఆరుగురిపై కేసు నమోదు

● ఆత్మహత్యగా చిత్రీకరించిన నిందితులు

● మిస్టరీని ఛేదించిన పోలీసులు

ఎల్కతుర్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యుతాఘాతానికి గురై మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని వ్యవసాయ బావిలో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించబోయిన నిందితులు పోలీసుల దర్యాప్తుతో పట్టుబడ్డారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అకినేపల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గండికోట సాంబరాజు (32), అదే గ్రామానికి చెందిన శీలం బాలరాజు, ఊదరి రాజులు కలిసి శనివారం అర్ధరాత్రి గ్రామ శివారులోని వచ్చునూరి ప్రవీణ్ పొలం వైపు పావురాల శిఖారుకు వెళ్లారు. అప్పటికే అక్కడ అడవి పందుల కోసం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన తక్కళ్లపెల్లి చందర్‌రావు ప్రోద్బలంతో అదే గ్రామానికి చెందిన పెండ్యాల తిరుపతి, ఎల్కతుర్తికి చెందిన బొజ్జ స్వామి, బొజ్జ సతీష్‌లు అడవి పందులను సంహరించడానికి వచ్చునూరి ప్రవీణ్ పొలంలో ఉన్న విద్యుత్ పోలు నుంచి తక్కళ్ళపెల్లి నర్సింగారావు చేను వరకు విద్యుత్ సరఫరాతో కూడిన వైర్లను అమర్చారు. అక్కడ అమర్చిన వైర్లను గమనించని సాంబరాజు విద్యుత్ వైర్లకు తగులగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆ సమయంలో వెంట ఉన్న ఉన్న శీలం బాలరాజు, ఊదరి రాజులు విషయాన్ని గమనించి అక్కడినుంచి పారిపోయారు. ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ వైర్లు అమర్చిన పెండ్యాల తిరుపతి, బొజ్జ స్వామి, బొజ్జ సతీష్‌లు నేరం తమపైకి రాకుండా ఉండేందుకు మృతదేహాన్ని పక్కనే ఉన్న గ్రామ మాజీ సర్పంచ్ మాసిపెద్ది భాస్కర్‌రావు వ్యవసాయ బావిలో పడేసి ప్రమాదానికి కారణమైన ఆనవాళ్లను తొలగించి గుట్టు చప్పుడు కాకుండా ఇంటికి చేరుకున్నారు. ఉదయం మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్ మృత దేహాన్ని బావిలోంచి బయటకు తీసి శవ పంచనామ నిర్వహించారు.

దీంతో మృతుడి కాలికి విద్యుత్ షాకు తగిలి ఏర్పడిన గాయాన్ని గుర్తించి దర్యాప్తును వేగవంతం చేశారు. మృతికి కారణమైన తక్కళ్ళపెల్లి చందర్‌రావు, పెండ్యాల తిరుపతి, బొజ్జ స్వామి, బొజ్జ సతీష్, శీలం బాలరాజు, ఊదరి రాజులను గుర్తించి మిస్టరీని ఛేదించారు. అనంతరం మృతురాలి భార్య మమత పిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితులు పరారీలో ఉండగా ప్రత్యేక పోలీస్ బృందంచే గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. అలాగే మృతుని బంధువులు నిందితుల ఇంటి వద్ద ఆందోళన చేసే పరిస్థితులు ఉండటంతో గోపాల్‌పూర్ గ్రామంలో సీఐ పులి రమేష్ ఆదేశాల మేరకు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

వైద్య కళాశాలలో నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి 19 వరకు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ సోమవారం తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు-9, అసోసియేట్ ప్రొఫెసర్-16, అసిస్టెంట్ ప్రొఫెసర్-21, సీనియర్ రెసిడెంట్-36, ట్యూటర్స్ మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

అధునాతన సౌకర్యాలతో కార్యాలయాలు

ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు

మహాముత్తారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అధునాతన సౌకర్యాలతో కార్యాలయాలను నిర్మించి ప్రజలకు ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలో ఎంపీడీవో, పీఏసీఎస్ నూతన కార్యాలయాలను ఆయన ప్రారంభించారు. రూ. కోటి 20లక్షలతో ఎంపీడీవో భవనాన్ని నిర్మించగా, రూ. 73లక్షల 50వేలతో పీఏసీఎస్ భవనాన్ని నిర్మించారు. వీటిని మంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో, పీఏసీఎస్ కార్యాలయాలకు అధునాతన సౌకర్యాలతో భవనాలను నిర్మించామని, దీంతో పరిపాలన సౌలభ్యం మెరుగుపడుతుందని అన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు సమర్థంగా అమలయ్యేలా కృషి చేయాలన్నారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. కలెక్టర్ రాహుల్ శర్మ, కాళేశ్వరం సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీసీవో వాలియ నాయక్, పీఆర్ ఎస్‌ఈ చక్రవర్తి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ డి.శ్రీనివాస్, ఎఫ్‌ఆర్వోలు రాజేశ్వర్, రమేష్, పీఏసీఎస్ సీఈవో శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మహాముత్తారం ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే లక్ష్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో గివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సౌజన్యంతో 650 మంది విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పాఠశాలలను బలోపేతం చేసేందుకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. ప్రతి నియోజవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని, టీచర్ల కొరత లేకుండా నోటిఫికేషన్ వేసి పోస్టులు భర్తీ చేస్తున్నారని అన్నారు. మహదేవపూర్ పాఠశాలకు మంచి చరిత్ర కలిగి ఉందని, దీన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని సీఎస్‌ఆర్ నిధుల ద్వారా రూ.15 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దీనికి ముందు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, గివ్ ఫౌండేషన్ ప్రతినిధి అరుణ్, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, మధు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

● వెంకటేశ్వర్లపల్లిలో ఘటన

చిలుపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో బీహార్‌కు చెందిన కార్మికుడు దుర్మరణం చెందిన ఘటన సోమవారం వెంకటేశ్వర్లపల్లిలో చోటు చేసుకుంది. జనగామ రూరల్ సీఐ (రఘునాథపల్లి) ఎడవెళ్లి శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. బీహార్ రాష్ట్రంలోని బాగులబడికి చెందిన అర్షద్ ఆలీ(25) వెంకటేశ్వర్లపల్లిలో హైటెన్షన్ విద్యుత్ స్థంభాల నిర్మాణానికి సంబంధించి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వైర్లు లాగడం కోసం సమీపంలో ఉన్న విద్యుత్ పోల్ పైకెక్కాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు.

సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీ ఎంకు తరలించారు. కాగా, ఆ సమయంలో మల్లికుదుర్ల నుంచి వెంకటేశ్వర్లపల్లికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య మృతదేహాన్ని సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు.

త్వరలో ముఖ గుర్తింపు హాజరు

కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి వెల్లడి

కేయూ క్యాంపస్ జూలై 14, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో పనిచేసే ఉద్యోగులందరికీ త్వరలోనే ముఖగుర్తింపు హాజరును తెస్తామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌లతో కలిసి కాన్వకేషన్ సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి పలు కీలక అంశాలను వెల్లడించారు. వచ్చే నెలలో ఉద్యోగులందరికీ ముఖగుర్తింపు హాజరు అమలు చేస్తామని, హ్యాక్‌థాన్ నిర్వహిస్తామని తెలిపారు. క్యాంపస్‌లో వైఫై సౌకర్యాలను మరింత సమర్థవంతంగా వచ్చేలా చేస్తామని, మౌలిక వసతులను కల్పిస్తామని స్పష్టం చేశారు. యూజీ కోర్సుల్లోనూ ఆన్‌స్క్రీన్ కంప్యూటరైజ్డ్ మూల్యాంకనం చేపడుతామని అన్నారు. క్యాంపస్‌లోని 14 సెమినార్ హాళ్ళను అధునీకరిస్తామని ప్రకటించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ ప్రోగ్రాంను సక్సెస్ చేసుకుందామని చెప్పారు. కె-హబ్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుందామని అన్నారు. కాకతీయ యూనివర్సిటీ వరంగల్ చానల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెబ్‌సైట్ ఇన్‌చార్జి డాక్టర్ రమేశ్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, డీన్లు ప్రొఫెసర్‌గాదె సమ్మయ్య, హన్మంతు, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల ఎదుట మావోయిస్టుల లొంగుబాటు

ములుగు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఐదుగురు మావోయిస్టులు ములుగు ఎస్పీ శబరీశ్ ఎదుట సోమవారం లొంగిపోయారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన ఏరియా కమిటీ సభ్యుడు శ్యామల రాజేష్ అలియాస్ ఐత (22), అదే ఏరియాకు చెందిన సభ్యులు కడ్తిల్‌దుమా (20), బీజాపూర్ జిల్లాకు చెందిన ఊకె జోగి (18), బాడిషె భీమా (21), ముచాకి జోగి (16) ఉన్నారని వివరించారు. ములుగు జిల్లా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులు సంయుక్తంగా చేపట్టిన 'పోరుకన్నా.. ఊరుమిన్న', 'మన ఊరికి తిరిగి రండి' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఎస్పీ అన్నారు. పోలీసు శాఖ కల్పిస్తున్న పునరావాస సదుపాయాలు నచ్చి మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

వివిధ కేడర్లలో పనిచేసిన 73 మంది మావోయిస్టులు ఏడు నెలల కాలంలో పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలిపారు. అధినాయకత్వ తీరు నచ్చక కిందిస్థాయి కేడర్ అజ్ఞాత వాసాన్ని వీడవి శాంతియుత జీవితం గడపడానికి లొంగిపోతున్నారని తెలిపారు. ఆదివాసీ గ్రామాల ప్రజలు మావోయిస్టులకు సహకరించకపోవడంతో ఆహార పానీయాలు అందక కేడర్ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లలేనంతగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. 90శాతానికి పైగా కేడర్ నిరుపేద ఆదివాసీలన్నారు. కుటుంబాల అభివృద్ధి కోసం చాలా మంది పార్టీని వీడుతున్నారన్నారు. ఇది శుభ పరిణామమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి పట్ల నిబద్ధతను కలిగి ఉందని తెలిపారు. సోమవారం లొంగిపోయిన ఐదుగురు మావోయిస్టులకు తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున రూ. 1.25 లక్షలు అందించామన్నారు. వారి పేరుపై ఉన్న రివార్డులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివంఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



లొంగిపోయిన మావోయిస్టుకు రివార్డు అందజేస్తున్న ఎస్పీ

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

● నానమ్మ మెడలో నుంచి బంగారు నగ చోరీ చేసిన మనవళ్లు

● నిందితుల్లో ఒక బాలుడు

● ఆభరణం రికవరీ, బైక్ స్వాధీనం

జఫర్‌గఢ్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నానమ్మ మెడలో నుంచి బంగారు ఆభరణాన్ని దొంగిలించిన ఇద్దరిని (ఒకరు మైనర్) పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. జఫర్‌గఢ్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ బానోత్ రాంచరణ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్ధన్నపేట సీఐ కె.శ్రీనివాసరావు ఘటనా వివరాలను వెల్లడించారు. ఓబులాపూర్‌కు చెందిన చీపురు యాకస్వామి బతుకు దెరువు కోసం భార్యా పిల్లలతో కలిసి కొన్నేళ్లుగా హైద్రాబాద్‌లోని చర్లపల్లిలో ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇతడి తల్లి వృద్ధురాలైన సులోచన ఓబులాపూర్‌లోని సొంత ఇంటిలో ఉంటోంది. యాకస్వామి పెద్ద కుమారుడు అఖిల్ జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాటు పడ్డాడు. తన నానమ్మ మెడలోని బంగారు గోపి తాడుపై కన్నేసి బాలుడైన తమ్ముడిని వెంటపెట్టుకుని ఈనెల 11న తెల్లవారుజామున బైక్‌పై అఖిల్ ఓబులాపూర్‌కు చేరుకున్నాడు.

నిద్రిస్తున్న నానమ్మ సులోచన మెడలో నుంచి 30గ్రాముల గోపి తాడును అన్నదమ్ములు బలవంతంగా తెంపుకుని పారిపోతుండగా వృద్ధురాలు మేల్కొని గట్టిగా కేకలు వేసింది. దీంతో ఆమెను నెట్టివేసి బైక్‌పై పారిపోతూ ఇదే మండలం తమ్మడపల్లి (జి) క్రాస్ వద్ద గల చెట్లపొదల్లో బంగారు నగను దాచి చర్లపల్లికి వెళ్లిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో దాచిన బంగారు గోపితాడును సోమవారం నిందితులైన యాకస్వామి, బాలుడు వచ్చి తీసుకుని బైక్‌పై వెళతుండగా జఫర్‌గఢ్ క్రాస్ నల్లబండ వద్ద పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి దొంగిలించిన 30 గ్రాముల గోపి తాడును, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అఖిల్‌పై పలు పోలీసు స్టేషన్లలో నాలుగు దొంగతనాల కేసులు ఉన్నాయన్నారు. దర్యాప్తులో ప్రతిభ కనబరిచి నిందితులను చాకచక్యంగా పట్టుకుని ఆభరణాన్ని రికవరీ చేసిన జఫర్‌గడ్ ఎస్ఐ రాంచరణ్‌నాయక్, పోలీసు సిబ్బందిని వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం అభినందించారు.



నిందితుడిని అరెస్ట్ చేసి, స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాన్ని చూపుతున్న వర్ధన్నపేట పోలీసులు

వాకింగ్ చేస్తుండగా విద్యార్థికి పిట్స్

● గ్రౌండ్‌లో కిందపడిపోవడంతో ఆస్పత్రికి తరలింపు

● చికిత్స పొందుతూ ఎంజీఎంలో మృతి

● మృతుడు ఇంటర్ విద్యార్థి

ధర్మసాగర్ , జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తోటి విద్యార్థులందరితో కలిసి మెలసి ఉంటూ వాకింగ్ చేస్తుండగా ఓ విద్యార్థికి పిట్స్ వచ్చి కిందపడిపోయాడు. పాఠశాల ఉపాధ్యాయులు పరిశీలించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్ మహాత్మాజ్యోతి బాపూ లే రెసిడెన్సియల్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక విద్యార్థులు తెలిపిన కథనం ప్రకారం. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన మహాత్మజ్యోతి బాపూలే రెసిడెన్షియల్ బాలుర సంక్షేమ పాఠశాల, కళాశాలను ఘన్‌పూర్‌లో సరైన వసతులు లేకపోవడంతో గత కొన్నేళ్ల క్రితం ధర్మసాగర్ మండలం కరుణాపురానికి తరలించారు. పదోతరగతి నుంచి ఇంటర్ వరకు 700 మంది విద్యార్థులతో పాఠశాల కొనసాగుతోంది. సోమవారం ఉదయం 6.45 గంటల సమయంలో పాఠశాలలోని విద్యార్థులందరూ పాఠశాల సమీపంలోని గ్రౌండ్‌లో రోజువారీగా వాకింగ్ చేస్తున్నారు.

ఈ క్రమంలో శాయంపేట మండలం ప్రగతి సింగరం గ్రామానికి చెందిన బత్తిని కుమారస్వామి విశాల దంపతులు కుమారుడు మణి తేజ(17) అనే విద్యార్థి ఇంటర్ సెకండియర్ ఎంపీసీ చదువుతున్నాడు. రోజువారిగా గ్రౌండ్‌లో వాకింగ్ మొదటి రౌండ్ పూర్తి చేసి, రెండవ రౌండ్ నడుస్తున్న క్రమంలో మణితేజకు ఆకస్మాత్తుగా పిట్స్ వచ్చి కిందపడ్డాడు. దీంతో ఆందోళనకు గురైన విద్యార్థులతో పాటు అక్కడే ఉన్న పీఈటీలు ఎం.రాజు, టి.రాజు ఇద్దరు కలిసి మణితేజను తమ ద్విచక్రవాహనంపై కొంత దూరంలో ఉన్న ప్రధాన రోడ్డు మీదికి తీసుకెళ్లారు. వెంటనే 108.కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మణి తేజ మృతి చెందాడు. పాఠశాల నుంచి తల్లి విశాలకు,తండ్రి కుమారస్వామికి మణితేజకు పిట్స్‌వచ్చిందని సమాచారాన్ని అం దించారు. కుటుంబసభ్యులు ఎంజీఎంకు వచ్చి మణితేజను చూసేసరికి అప్పటికే మృతిచెంది ఉన్నాడు. దీంతో వారి రోదనలు మిన్నంటాయి. సీఐ ప్రవీ ణ్ కుమార్ పాఠశాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





మృతి చెందిన విద్యార్థి మణితేజ, కరుణాపురం జ్యోతిబాపూలే పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు

గృహోపకరణాల దగ్ధం

రూ.2 లక్షల ఆస్తి నష్టం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్ పూర్‌లో సెలెక్ట్ మొబైల్ ఎదురుగా ఉన్న 33కేవీ లైన్ తీగలు ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కావడంతో మూడు ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. దీంతో రూ.2లక్షల దాక ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. మహాలక్ష్మి బేకరి వద్ద ఉన్న 33 కేవీ లైన్ తీగల్ని కాకులు తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరిగిందని ఇంటి యజమాని ప్రతాపగిరి సుగుణ వాపోయింది. దీంతో ఇంటిలోని స్మార్ట్ టీవీ, సీసీ కెమెరాలు, ఫ్రిడ్జ్, వైరింగ్, స్విచ్‌లు కాలిపోయాయి. అలాగే బాలాజీ క్లాత్ స్టోర్‌లో సర్వీస్ వైరు, రవళి కంగన్ హాల్‌లో టీవీ కాలిపోయిందని మొత్తంగా రూ.2 లక్షల వరక ఆస్తినష్టం వాటిల్లినట్టు పేర్కొంది. ఇదే లైన్‌తో మే 20న కె.కృష్ణకుమారి ఇంటిపై పిడుగు పడి ఇంట్లోని విద్యుత్, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయి రూ.1.5 లక్షల దాక నష్టం వాటిల్లింది. ఇదే ఇంటిలో 2022లో, 2023లో వర్షాకాలంలో పిడుగు పడి వస్తువులు కాలిపోయాయి. జనావాసాల నడుమ ఉన్న 33కేవీ లైన్‌ను మార్చాలని లేదా బేకరి వద్ద టవర్ వేసారని, ఆ తర్వాత టవర్ వేయక పోవడం వల్ల లైన్ తీగలు కిందకు ఉండడం వల్ల కూడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని బాధితులు చెబుతున్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు గుంజె హన్మంతు మృతి

నివాళులర్పించిన జేఏసీ, వివిధ పార్టీలు, సంఘాల నేతలు



హన్మంతు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు

మహబూబాబాద్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణానికి చెందిన తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు గుంజె హన్మంతు(86) ఆదివారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. తన స్వగృహంలో గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు సంతానం. కాగా, గుంజె హన్మంతు తెలంగాణ రాష్ట్ర తొలి, మలి దశ ఉద్యమాలతో పాటు జిల్లా ఏర్పాటు, కుల, సామాజిక, సాంస్కృతిక, ప్రజా ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషించారు. స్వరాష్ట్ర ఉద్యమంలో కేసులపాలై జైలు జీవితం కూడా గడిపారు. తన వయసు మళ్లినప్పటికి తుది శ్వాస విడిచేంతవరకు ప్రజా ఉద్యమాల్లో చురుకుగ్గా పాల్గొన్నారు. గుంజె హన్మంతు మృతి వార్త తెలుసుకున్న జేఏసీ కన్వీనర్ డాక్టర్ డోలి సత్యనారాయణ, నేతలు ఎమ్డీ.ఫరీద్, పిల్లి సుధాకర్, శంతన్‌రామరాజు, గుగ్గిళ్ల పీరయ్య, కొండ్ర ఎల్లయ్య, సామ పాపయ్య, కమ్మగాని కృష్ణమూర్తి, ఇ.ఉప్పలయ్య, కంబాలపల్లి సత్యనారాయణ, బోడ లక్ష్మణ్, ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణి ఉమ, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మార్నేని వెంకన్న, బి.విజయసారథి, బి.అజయ్‌సారథిరెడ్డి, సూర్నపు సోమయ్య, పద్మం ప్రవీన్, హరిసింగ్, మార్నేని రఘు, మామిడాల సత్యనారాయణ, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, నారోజు సత్యమనోరమ, నారాయణసింగ్ తదితరులు పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో హన్మంతు భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. కాగా, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఫోన్‌లో హన్మంతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మానుకోట మాజీ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు.

అమరవీరుల స్థూపం వద్ద నివాళులు..

మహబూబాబాద్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ నుంచి సిగ్నల్ కాలనీలోని శ్మశానవాటిక వరకు ఉద్యమకారుడు గుంజె హన్మంతు అంతిమ యాత్ర కొనసాగింది. ముత్యాలమ్మ గుడి సెంటర్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద గుంజె హన్మంతు మృతదేహంతో తెలంగాణ ఉద్యమకారులు నివాళులర్పించి మౌనం పాటించారు. కళాకారులు పాటలు పాడి హన్మంతు పోరాట స్మృతులను స్మరించుకున్నారు. అక్కడి నుంచి సిగ్నల్ కాలనీ శ్మశానవాటిక వద్దకు తీసుకుని వెళ్లి క్రైస్తవ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ పూర్వ కన్వీనర్ డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ.. గుంజె హన్మంతు అకాల మృతి సామాజిక ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2405	1521
పల్లికాయ (సూక)	5800	3450
పల్లికాయ (పచ్చిది)	4350	1575
కందులు	6122	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7500	5300
పసుపు (కాడి)	11920	9534
పసుపు (గోల)	10309	9700
తేజ మిర్చి	9500	8500
తేజ ఏసీ	13000	11500
వండర్‌హాట్	11000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	12200	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఇందిరమ్మ ఇళ్లకు ధరాఘాతం

- పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలు
- సిమెంట్, స్టీల్‌ది అదే దారి
- సమస్యగా మారిన కూలీల కొరత
- లబ్ధిదారులపై ఆర్థిక భారం

దేవరుప్పుల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతో సొంతింటి కల నెరవేరుతుందన్న ఆనందంకంటే, నిర్మాణ భారం పెరుగుతుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. నిర్మాణ సామగ్రి, కూలి రేట్లు పెరగడంతో లబ్ధిదారులకు ఆర్థిక భారం తప్పడం లేదు. దీంతో ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలు సరిపోవడం లేదని వాపోతున్నారు. చేసేది లేక కొందరు అప్పు చేస్తుంటే, మరి కొందరు బంగారం తాకట్టు పెడుతున్నారు. అధికారులు మాత్రం ప్రభుత్వం ఇస్తున్న రూ.5లక్షలతో నివసించేందుకు సరిపడేలా ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవచ్చని, అదనపు వసతుల పేరుతో అప్పులపాలు కావద్దని పేర్కొంటున్నారు.

పెరిగిన ధరలు ఇలా..

సామగ్రి	పాత ధర	కొత్తధర
ట్రాక్టర్ రాయి	రూ.2,000	రూ. 2,500
ట్రాక్టర్ దొడ్డు కంకర	రూ.2,000	రూ.2,500
ట్రాక్టర్ సన్న కంకర	రూ.3,700	రూ.4,500
స్టీల్ కేజీ	రూ.48	రూ. 55
సిమెంట్ బస్తా	రూ.300	రూ. 380
ట్రాక్టర్ ఇసుక	రూ.2,000	రూ. 4,000
ఇటుక ఒకటి	రూ.12	రూ. 14
లేబర్ (రోజుకు)	రూ.600	రూ. 800
తాపీమేస్త్రీ (రోజుకు)	రూ.900	రూ.1,200
బిల్డర్స్ స్క్వేర్ ఫీట్	రూ.1,600	రూ.1,650

పెరిగిన ధరలు

ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభమైన నాటి నుంచి నిర్మాణ సామగ్రి, తాపీమేస్త్రీ, లేబర్ కూలి ధరలు అమాంతం పెరిగాయి. ఖరీఫ్ సీజన్ కావడంతో కూలీల కొరత ఏర్పడుతోంది.

పత్తి కలుపు తీయడానికి, ఇతర వ్యవసాయ కూలి పనులకు వెళ్తున్నారు. బీహార్ నుంచి వలస వచ్చిన తాపీమేస్త్రీ, కూలీలు కూడా వర్షాకాలం కావడంతో పాటు అక్కడ ఎన్నికల నేపథ్యంలో కొంత మంది ఇప్పటికే స్వగ్రామాలకు వెళ్లిపోయారు. ఒప్పుకున్న సమయానికి ఇల్లు నిర్మించి ఇచ్చే విషయంలో కూలీల కొరతతో బిల్డర్లు తంటాలు పడుతున్నారు.



సీతారాంపురంలో పిల్లర్ల దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

ఇసుక పాలసీ ఇలా..

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో అది సాధ్యమవడం లేదు. ఉచిత ఇసుక అనగానే ఇంటికి సరిపడా ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని లబ్ధిదారులంతా భావించారు. అందుబాటులో ఉన్న వాగుల నుంచి ఇసుకను ఉచితంగా తెచ్చుకునేందుకు ట్రాక్టర్ల కిరాయి ఖర్చులు అధికమవుతున్నాయి. వాగు పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలకు రూ. 2వేలు, మండల పరిధిలోని కొన్ని దూరపు గ్రామాలకు రూ.4వేలు, ఇతర మండలాలలోని గ్రామాలకు రూ. 6వేలు చొప్పున ట్రాక్టర్ ఇసుకను విక్రయిస్తున్నారు. 400ఫీట్ల ఇంటి నిర్మాణానికి 6 ట్రిప్పులు, 500ఫీట్ల ఇంటి నిర్మాణానికి 9ట్రిప్పులు, 600ఫీట్ల ఇంటి నిర్మాణానికి 12ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక రవాణాకు స్థానిక తహసీల్దార్ కార్యాలయాలు అనుమతులు ఇస్తున్నాయి. దీంతో ఇసుక భారం తప్పడం లేదు.

తప్పని అప్పు

లబ్ధిదారుల్లో మెజారిటీ పేదలే ఉన్నారు. కొద్దిమంది మధ్య తరగతి ప్రజలు ఉన్నారు. 400-600 ఫీట్లలోపే ఇందిరమ్మ ఇంటిని నిర్మించాలని నిబంధనలు స్పష్టం చేస్తుండగా, ప్రభుత్వం ఇస్తున్న రూ.5లక్షలకు మరింత జోడిస్తే ఇంకాస్త సౌకర్యంగా నిర్మించుకోవచ్చని ఆశపడుతున్నారు. దీంతో బంగారాన్ని బ్యాంకులు, ఇతర ప్రైవేటు సంస్థల్లో తాకట్టు పెడుతున్నారు. కొందరు అధిక వడ్డీతో అప్పు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలకు అదనంగా రూ.4 లక్షల నుంచి రూ.7లక్షల వరకు అదనంగా ఖర్చు అవుతోందని తెలుస్తోంది.

అప్పు చేయక తప్పడం లేదు

బస్వ అనసూర్య, లబ్ధిదారు, సీతారాంపురం



ప్రభుత్వం ఇల్లు నిర్మాణం కోసం రూ.5 లక్షలు కేటాయించినా సరిపోవడం లేదు. ఇంకో ఐదారు లక్షల వరకు అప్పు చేయాల్సి వస్తోంది. ఇప్పటికే అప్పు తెచ్చాం. పాత పెంకుటిల్లుతో చాలా ఇబ్బందులు పడ్డాం. కోతులు పెంకులు పీకడంతో వర్షాకాలంలో ఇళ్లంతా కురిసేది. పెంకుటిళ్ల కూలగొట్టి స్లాబ్ వేసుకుంటున్నాం. కానీ ఖర్చులు పెరుగుతున్నాయి.

నిబంధనల ప్రకారమే ఇల్లు నిర్మించుకోవాలి

సురేష్‌కుమార్, ఎంపీడీవో, దేవరుప్పుల



ప్రభుత్వ నిబంధన ప్రకారమే ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలి. 400-420 స్క్వేర్ ఫీట్స్‌లో ఇల్లు పిల్లర్లు లేకుండా కట్టుకుంటే ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలు సరిపోతాయి. అదనపు వసతుల కోసం హంగులు, ఆర్భాటాలకు పోయి 600 స్వేర్ ఫీట్స్ వరకు ఇల్లు నిర్మించుకుని రూ.10లక్షల నుంచి రూ.12 లక్షలు ఖర్చు చేసి అప్పులపాలు కావద్దు. ముగ్గు పోసుకునే ముందు మా కార్యదర్శులకు సమాచారం ఇస్తే రూ. 5లక్షల వ్యయంతో 400స్క్వేర్ ఫీట్స్ వరకు దగ్గరుండి పోయిస్తారు.



నెల్లుట్ల గ్రామ పంచాయతీ

ఎర్రకోటలో స్వాతంత్ర్య వేడుకలకు నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శి

- ప్రత్యేక అతిథి జాబితాలో రొండ్ల శ్రీనివాస్‌రెడ్డికి చోటు
- కేంద్రానికి సిఫారసు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

లింగాలఘణపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీ ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తెలంగాణ నుంచి ప్రత్యేక అతిథులుగా పంపేందుకు పలువురి అధికారుల జాబితాను తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి నామినేట్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జాబితాలో జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శి రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ప్రతీ ఏటా ఎర్రకోటపై భారత రక్షణ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథులను కేంద్రం ఆహ్వానించడం ఆనవాయితీ. ఈమేరకు 2025 వేడుకల కోసం రాష్ట్రాల నుంచి హాజరుకావాల్సిన ప్రత్యేక అతిథుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. కేంద్ర పథకాలను సంపూర్ణంగా అమలు చేసి అవార్డులను అందుకున్న గ్రామపంచాయతీల ప్రతినిధులను ఎంపిక చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ కేంద్రానికి సిఫారసు చేసింది.

ఈ జాబితాలో 2023 ఏప్రిల్ 6న నీటి సమృద్ధి పథకంలో జాతీయ స్థాయి పురస్కారం నెల్లుట్ల గ్రామపంచాయతీకి దక్కింది. దీంతో అప్పటి సర్పంచ్ చిట్ల స్వరూపారాణిభూపాల్‌రెడ్డి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ ఏడాది తెలంగాణ నుంచి పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారితోపాటుగా మరో ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను నామినేట్ చేస్తూ కేంద్రానికి పంపింది. జాబితాలో నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డికి చోటు దక్కడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రం సిఫారసు చేసినట్లుగా నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శిని ప్రత్యేక అతిథిగా గుర్తిస్తూ కేంద్రం తుది నిర్ణయం తీసుకుంటే పంచాయతీకి అరుదైన గౌరవం దక్కినట్లు అవుతుందని జిల్లావాసులు పేర్కొంటున్నారు.



సంపత్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

చాకలి ఐలమ్మ ముని మనవడి మృతి

కొద్ది రోజులుగా అనారోగ్యంతో సతమతమవుతున్న సంపత్



సంపత్ (ఫైల్)

పాలకుర్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ముని మనవడు చిట్యాల సంపత్ (45) అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. చాకలి ఐలమ్మ రెండో కుమారుడు పిచ్చయ్యకు భార్య భారతమ్మ, నలుగురు కుమార్తెలుండగా, ఏకైక కుమారుడు సంపత్. పిచ్చయ్య గతంలో చనిపోయాడు. పదేళ్ల క్రితం కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లి ఎలక్ట్రీషియన్‌గా సంపత్ పని చేశాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో మూడేళ్లుగా సంపత్ పాలకుర్తిలోనే ఉంటున్నాడు. సంపత్ భార్య గౌరీశ్వరీ, కుమారుడు ఐటీఐ పూర్తి చేసి ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండగా, కుమార్తె ఎంబీఏ చదువుతుంది. కాగా, సంపత్ సీపీఐ(ఎం)లో పని చేశారు. 1981, 1994 జీపీ ఎన్నికల్లో సీపీఎం బలపరిచిన అభ్యర్థిని గెలిపించడంలో కీలకపాత్ర పోషించాడు.

పలువురి నివాళి

సంపత్ మరణవార్త తెలుసుకుని పలువురు సోమవారం ఆయన ఇంటికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏదునూరి మదార్, చిట్యాల సమ్మయ్య మృతదేహానికి నివాళులర్పించారు. సోమవారం పాలకుర్తిలో సంపత్ అంత్యక్రియల్లో ప్రజాసంఘాలు, ఐలమ్మ వాసులు పాల్గొన్నారు.

11 ఏళ్ల నిరీక్షణకు తెర

- కొత్త రేషన్ కార్డుల మంజూరు
- జిల్లాలో ఇప్పటి వరకు 2,31,516 కార్డులు
- కొత్త కార్డుల సంఖ్య 14,541



హనుమకొండ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు అందనున్నాయి. ప్రజాపాలనతో పాటు విడిగా మీ-సేవ సెంటర్ల ద్వారా నిరుపేదలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో కొత్త సభ్యుల చేర్పుతో పాటు ఇతర మార్పులు, చేర్పులకు సంబంధించి కూడా దరఖాస్తు చేసుకుంటున్నారు. రేషన్‌కార్డు దరఖాస్తు నిరంతరం ఉంటుందని ప్రభుత్వం చెప్పడంతో ఇంకా దరఖాస్తులు అందుతూనే ఉన్నాయి. వీటన్నింటిని రెవెన్యూ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిపి ధృవీకరిస్తున్నారు. ధృవీకరించిన దరఖాస్తులను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు కమిషనర్ కార్యాలయానికి పంపించడం, కార్డులు మంజూరు కావడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు కార్డులు అందడంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు కూడా అందనున్నాయి.

సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించడంతో ఇక హనుమకొండ జిల్లాలో కూడా కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు కూడా అందనున్నాయి. ఇప్పటికే కొందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు మంజూరైన విషయం తెలిసినప్పటికీ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో ఇక వారికి కార్డులు అందనున్నాయి.

హనుమకొండ జిల్లాలో 2,31,516 కార్డులు

హనుమకొండ జిల్లాలో మొత్తంగా 2,31,516 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇలా ఉండగా కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల్లో 16,541 కార్డులు మం జూరయ్యాయి. వీరందరికి కూడా రేషన్ కార్డులు అందుతాయి. కార్డు మంజూరును మీ-సేవా లేదా ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చని అధికారులు చెబు తున్నారు. లబ్ధిదారులకు ఆహార భద్రతా కార్డు స్లిప్ రూపంలోనే రేషన్ కార్డులు అందుతున్నాయి. ఇకపై ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేయ నుంది. అయితే జిల్లా అధికారులు మాత్రం ఇంకా ప్రభుత్వం నుంచి నిర్దిష్ట ఆదేశాలు రాలేదంటున్నారు. జిల్లాలో కొత్త లబ్ధిదారుల ఎంపిక నిరంతరం ఉంటుందంటున్నారు. అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకోవచ్చని, పరిశీలన పూర్తి కాగానే కార్డు మంజూరు అవుతుందంటున్నారు. ఇక కొత్తగా మం జూరైన కార్డుదారులందరికి సెప్టెంబరు నుంచి సన్న బియ్యం అందనున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే జూన్ నుంచి ఆగస్టు వరకు మూడు నెలల బియ్యం కోటాను లబ్ధిదారులకు అందచేసింది. ఈ క్రమంలో సెప్టెంబరు నుంచి రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ జరుగనుంది.

నెరవేరిన కల

రేషన్ కార్డు కోసం 11 ఏళ్ల కిందటే దరఖాస్తులను అప్పటి బీఆర్ ఎస్ ప్రభుత్వం స్వీకరించింది. కార్డు కోసం కొత్తగా వేల సంఖ్యలో దరఖాస్తులు జిల్లా అధికార గణానికి అందాయి. మార్పులు, చేర్పుల దరఖాస్తులు కూడా సమర్పించారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణతోనే సరిపెట్టింది. పదేళ్ల ఆ ప్రభుత్వ హయాంలో కార్డులు కల గానే మిగిలాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలం గడిచిన తరువాత ప్రజాపాలన ద్వారా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించింది. మీ-సేవ సెంటర్ల ద్వారా దరఖాస్తులు నమోదు అయ్యాయి. ప్రతీ ఒక్కరికి కార్డులు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అంతే కాకుండా లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని కూడా పంపిణీ చేస్తోంది. ఈ మేరకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొత్తంగా 11 ఏళ్ల రేషన్ కార్డు నిరీక్షణకు తెరపడింది.

యూరియా దొరికేనా ?

- పీఏసీఎస్‌ల వద్ద రైతుల బారులు
- సరిపడా పంపిణీ చేయని అధికారులు
- నానో యూరియాపై అవగాహన కరువు
- పంట దిగుబడులపై ప్రభావం
- ప్రభుత్వంపై రైతాంగం మండిపాటు



నల్లబెల్లి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు



చెన్నారావుపేటలో యూరియా కోసం పడిగాపులు పడుతున్న రైతులు

వరంగల్ వ్యవసాయం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు వేసిన రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. పీఏసీఎస్, ప్రైవేటు ఫర్టిలైజర్స్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. పుష్కర కాలంగా రైతులు ఏనాడూ యూరియా కొరతను ఎదుర్కోలేదు. కాని ఈసారి ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పరిస్థితులే పునరావృతం అవుతున్నాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాష్ట్రానికి కావాల్సినంత యూరియా పంపిణీ చేయాలని కేంద్రాన్ని కోరినా ఉపయోగం కనిపించడం లేదు. ఇదిలా ఉంటే వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖాధికారులు మాత్రం జిల్లాలో సాగుకు సరిపడా యూరియాను ఇప్పటికే పంపిణీ చేయడంతో పాటు అదనంగా 70 వేల బస్తాలను పంపిణీ చేసినట్లు చెబుతుండడం విడ్డూరంగా ఉంది.

రైతులు ఆగ్రహం

సకాలంలో యూరియా వాడకపోతే దాని ప్రభావం పంట దిగుబడిపై పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలంలో ఎన్నడూ యూరియా కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకున్న ప్రభుత్వం ఈ దఫా మాత్రం యూరియా కోసం ఎదురు చూడాల్సి వస్తోందని మండి పడుతున్నారు.

నానో యూరియాపై అవగాహన లేమి

పంట సాగులో ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ద్రవ రూపంలో నానో యూరియాను అందుబాటులోకి తెచ్చింది. దీనివల్ల పంటకు త్వరగా నత్రజని అందుతుంది. కిరణజన్య సంయోగక్రియ పెరుగడంతో పాటు అధిక దిగుబడి వస్తుంది. ద్రవ రూపంలో ఉన్న అర లీటర్ నానో యూరియా 45 కిలోల యూరియా బస్తాతో సమానంగా పనిచేస్తుంది. యూరియా బస్తాకు రూ.266లు ఉండగా ద్రవ రూపంలో ఉన్న అర లీటరు నానో యూరియా రూ.225లకే మార్కెట్లో దొరుకుతోంది. నానో యూరియా పైపాటుగా పంటసాగుపై స్ప్రే చేయడం వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుంది. అయితే వ్యవసాయశాఖ అధికారులు నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించకపోవడంతో రైతులు ఆసక్తి చూపించడం లేదు. దీంతో యూరియాకు డిమాండ్ పెరిగింది.

రోజంతా క్యూలో ఉంటే రెండు బస్తాలిచ్చారు..

- కందకట్ల సాంబయ్య, రైతు, చెన్నారావుపేట



రోజంతా లైనులో నిల్చుంటే రెండు యూరియా బస్తాలు ఇచ్చారు. నానో యూరియా కొంటేనే యూరియా బస్తాలు ఇస్తామన్నారు. నాకు ఉన్న రెండెకరాలకు గతంలో ఎంతో సులువుగా యూరియా దొరికేది. యూరియాను పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుని రైతాంగాన్ని ఆదుకోవాలి.

ముందుగానే దిగుమతి చేసుకోవాల్సింది..

- బొందిరెడ్డి ప్రతాపరెడ్డి, రైతు, కన్నారావుపేట



ఖరీఫ్ ప్రారంభం కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కావాల్సిన యూరియా దిగుమతి చేసుకోవాల్సింది. యూరియా సకా లంలో అందకపోతే దిగుబడి తగ్గిపోతుందని రైతాంగం ఆందోళన చెందుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా యూరియా పంపిణీపై దృష్టి పెట్టాల్సింది. ఇప్పటికైనా వెంటనే రైతాంగానికి కావాల్సినంత యూరియాను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

ఆందోళన వద్దు..

కె.అనురాధ, వ్యవసాయశాఖ జిల్లా అధికారి



జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు అవసరానికి మించి అదనంగా 70 వేల యూరియా బస్తాలను పంపిణీ చేశాం. జిల్లాలో ఇప్పటి వరకు పత్తి 1,09,360 ఎకరాలు, వరి 6,500, మొక్కజొన్న 11,500, కందులు 40, పత్తి 40, మినిములు 40, ఎర్ర జీలుగ 10,200 ఎకరాలు సాగైంది. వాటికి సరిపోను యూరియాను ఇప్పటికే పంపిణీ చేశాం. సోషల్ మీడియాలో కథనాలను నమ్మవద్దు. వాస్తవానికి యూరియా కొరత లేదు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

బాధ్యత లేకుండా భట్టి మాట్లాడటం సరికాదు

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి



భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం స్థాయిలో ఉన్న భట్టి విక్రమార్క బీజేపీ చీఫ్‌పై బాధ్యత లేకుండా మాట్లాడటం సరికాదని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భట్టి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం హనుమకొండ అదాలత్ జంక్షన్‌లో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు ఆధ్వర్యంలో భట్టి విక్రమార్క దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొలను సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి, న్యాయవాదిగా, నాయకుడిగా నిరంతరం ప్రజా సేవలో ఉంటున్న రాంచదర్‌రావుపై పాత సంఘటనల పేరుతో బురదజల్లే ప్రయత్నం చేయడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. హెచ్‌సీయూ ఘటనకు రాంచందర్‌రావుకు ఏలాంటి సంబంధం లేదని పోలీసులు, హైకోర్టు స్పష్టం చేయడం జరిగిందన్నారు. రోహిత్ వేముల దళితుడు కాదని బీసీ వర్గానికి చెందిన వాడని కోర్టు తేల్చి చెప్పడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ దళిత ముసుగులో ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. కోర్టు తీర్పులను అంగీకరించలేని నేతలు అధికారంలో ఉండటం ప్రమాదకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుందన్నారు. భట్టి విక్రమార్క వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు బన్నా ప్రభాకర్, ఎస్టీ మోర్చా నాయకుడు నానునాయక్, వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, ఉపాధ్యక్షుడు శ్రీనువాస్, కార్యదర్శులు శివకుమార్, వెంకటేశ్, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

ములుగు
మంగళవారం 15 జులై 2025

ప్రజావాణి వినతులకు ప్రాధాన్యమివ్వాలి : కలెక్టర్ దివాకర


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధామిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి 75 విన తులను స్వీకరించారు. పెండింగ్‌లో పెట్టకుంట వినతుల ను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో

వెంకటాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోదాపురం పంచాయతీ పరిధిలోని గుట్టబోరు గ్రామస్థులు తాగునీటి సౌకర్యం కల్పించాలని సోమవారం ఆర్ అండ్‌బీ రహదారిపై బైఠాయించి ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలోని తాగునీటి పథకం మోటారు మరమ్మతులకు గురైందని, మరమ్మతులు చేయించాలని పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోవడంలేదన్నారు. ఈవిషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు సంఘటన వద్దకు చేరుకుని గ్రామస్థులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మొగుళ్లపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దవాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై బి.అశోక్ సోమవారం తెలిపారు. మండలంలోని పోతుగల్లు, పాత ఇస్సిపేటకు చెందిన యజమానులు గాజుల పరమేశ్, బొల్లెపల్లి రాము లు, నేర్పాటి శ్రీనులు ఎలాంటి అనుమతి లేకుండా వాగు నుంచి పరకాల, తదితర గ్రామాలకు ఇసుకను తరలిస్తున్నారని అన్నారు. చింతలపల్లి గ్రామశివారు వద్ద మా టువేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో వారి తోపాటు డ్రైవర్లు తిప్పనవేని కిరణ్‌కుమార్, రమేష్, సమ్మయ్యపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

మల్హర్, జూలై 14(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల ఎస్టీ వసతి గృహం, వల్లెంకుంట గ్రామాల్లో తాడిచర్ల ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యాధికారులు వినయ్ భాస్కర్, సుజయ్ కిరన్ గ్రామస్థులకు వివరించారు.

వాగులు దాటి వెళ్లేదెలా..?!

చిత్తడిగా రహదారులు • రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

కన్నాయిగూడెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, పరిపాలనను ప్రజలకు మరింత దగ్గరగా అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే ఏటూరునాగారం మండలం నుంచి కన్నాయిగూడెం వేరుపడి కొత్త మండలంగా ఆవిర్భవించింది.

భౌగోళికంగా ఐలాపూర్ కన్నాయిగూడెం మండలానికి దగ్గర అవుతుందనే ఉద్దేశంతో ఐలాపూర్ ఆ గ్రామాన్ని కన్నాయిగూడెం మండలంలో కలిపారు. మండలమైతే ఏర్పాటు చేశారు గానీ, గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించడం మాత్రం పాలకులు, అధికారులు విస్మరించారు. కొత్త మండలం ఏర్పాటైనా ఇక్కడి రహదారులకు మహర్దశ పట్టడం లేదు. వర్షాకాలం వస్తే చాలు.. ఐలాపూర్- సర్వాయి గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. మారుమూల అటవీ గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐలాపూర్‌తో పాటుగా సర్వాయి, కంతనపల్లి గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఐలాపూర్ వెళ్లాలంటే మూడు వాగులు దాటి వెళ్లాల్సిందే. ఈ గ్రామస్థులు వివిధ పనుల మీద మండల కేంద్రానికి రావాలన్నా, బ్యాంకుల పనిమీద ఏటూరునాగారం వెళ్లాలన్నా కోర్లవాగు, మేడివాగు దాటి రావాల్సిందే. ఈ గ్రామానికి అసలే రోడ్డు మార్గం లేదు. రిజర్వ్ ఫారెస్టు నుంచి 15 కిలో మీటర్లు ద్విచక్ర వాహనాలు, కాలి నడకన ప్రయాణం చేయాలి. పూర్తి అటవీ మార్గం కావడంతో ప్రయాణించేటప్పుడు వన్యప్రాణులు ఎప్పుడు దాడి చేస్తాయో అని బిక్కుబిక్కు మంటూ వెళ్లాల్సిందే. వర్షాకాలం కావడంతో గ్రామాల ప్రజల బాధలు వర్ణనాతీతం. గ్రామం చుట్టూ ఉన్న బాగులు పొంగి పొర్లినప్పుడు ఈ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి.


బురదమయంగా సర్వాయి-ఐలాపూర్ రహదారి

వర్షాకాలం కావడంతో ఆ గ్రామాలకు వెళ్లేందుకు అవస్థలు తప్పటం లేదు. గ్రామంలోని ప్రజలకు ఎవరైన అనారోగ్యానికి గురైతే వైద్యం అందని పరిస్థితి. కనీసం అంబులెన్సు కూడా వెళ్లలేని దుస్థితి ఇక్కడ నెలకొంది. వైద్యానికి వెళ్దామంటే చుట్టూ ఉన్న వాగులు కారణంగా ఎటూ వెళ్ల లేని పరిస్థితి. రోడ్డు సౌకర్యం లేక పోవడంతో అనారోగ్యాల బారిన పడి ప్రాణాలు విడిచిన సంఘటనలు ఉన్నాయి.

ఈ క్రమంలో ఆరు సంవత్సరాల క్రితం గత ప్రభుత్వం గిరిజనుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఏటూరునాగరం మండలంలోని కొండాయి మీదుగా ఐలాపూర్ వరకు, తుపాకులగూడెం ఏటూరునాగారం ఆర్‌ఎండ్‌బీ రోడ్డు నుంచి కంతనపల్లి వరకు, సర్వాయి నుం,ఇ ఐలాపూర్ వరకు రోడ్లను నిర్మించేందుకు నిధులు కేటాయించింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కంతనపల్లి, కొండాయి, ఐలాపూర్ మధ్యలో కూడా మొదలు పెట్టారు. కొంత మేర పనులు జరిగాకా ఈ రోడ్లు అటవీ ప్రాంతంలో ఉన్నాయని ఫారెస్టు అధికారులు అడ్డుకున్నారు. దీంతో చేసేదేమీ లేక కాంట్రాక్టర్ చేతులెత్తేసి వెళ్లిపోయాడు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు లేవని చెబుతుంటే స్థానిక ఎమ్మెల్యే వేల కోట్లు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని మాట్లాడటం విడ్డూరమన్నారు. ఇందులో ఏది నిజమో అర్థంకాని పరిస్థితి ఉందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నడూ యూరియా కొరత ఇప్పెడెందుకు వచ్చిందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలనను తిరిగి రావాలని కోరుకుంటున్నారన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి కాళేశ్వరంలోని మేడిగడ్డ పంపులను ఆన్‌చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్ రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. వ్యవసాయ రంగం కుంటుపడితే రాష్ట్రంలో వివిధ రంగాలపై దాని ప్రభావం చూపిస్తోందన్నారు. మీడియా ముసుగులో కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మల్లన్నపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టేకమట్ల మండలలంలో ఇసుక అక్రమ రవాణా అడ్డు అదుపు లేకుండా నడుస్తోందని వెంటనే దీన్ని అరికట్టాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు.


టేకుమట్లలో నిరసన తెలుపుతున్న వెంకటరమణరారెడ్డి తదితరులు

మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, నాయకులు ఉద్దమారి మహేష్, వెంకటేశ్వర్లు, గువ్వాడి లక్ష్మణ్, బందెల నరేష్, పోతనవేని ఐలయ్య, రఘు, నేరేళ్ల శ్రీనివాస్, బోయిని సమ్మయ్య, పొన్నం చంద్రయ్య, నేరేళ్ల రామక్రిష్ణా, దొడ్ల కోటి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిట్యాల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కనకం తిరుపతి, నైన్‌పాకకు చెందిన శ్రీపతి మొండయ్య, కాసర్ల కమలమ్మ, దూత్ పల్లికి చెందిన వెంకటస్వామి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, యూత్ మండల అధ్యక్షుడు నవీన్, మండల ప్రదాన కార్యదర్శి రాజేందర్, నాయకులు వీరస్వామి, రాజు, భద్రయ్య, వెంకటేశ్, నారాయణరావు తదితరులు ఉన్నారు.

మహిళలకు విరివిగా బ్యాంకు రుణాలు

అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మహిళలకు విరివిగా బ్యాంకు రుణాలు అందింస్తున్నట్టు అదనపు కలెక్టర్ సంపత్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.223 కోట్ల లక్ష్యానికి 2,596 సంఘాలకు రూ.230 కోట్ల ప్రగతి సాధించినందుకు రాష్ట్రస్థాయిలో ములుగు జిల్లా పురస్కారం అందుకుందని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.222కోట్ల లక్ష్యానికి ఇప్పటి వరకు 618 సంఘాలకు రూ.54కోట్ల 39లక్షల ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ పెట్టుబడితోపాటు బ్యాంకు రుణాలతో మహిళలు వివిధ రకాల ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు.

నేటి ధర్నాను విజయవంతం చేయండి

వెంకటాపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ములుగు కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిర్వహించే ధర్నా, నిరసన కార్యక్రమాన్ని పెన్షనర్లు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్(టాప్రా) రాష్ట్ర కమిటీ నాయకుడు పోతుల నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ధర్నాకు జిల్లాలోని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు, జిల్లా ఆఫీసు బేరర్లు, జిల్లా కమిటీ సభ్యులు, క్రియాశీల కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

'ఓపెన్' అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ములుగు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్ పొందేందుకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ ఏషబోయిన సాంబయ్య యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యలో చదువు మానేసినవారు, పదోతరగతి పూర్తి చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8978916637, 9505478073 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఏఐ కంపెనీ ప్రతినిధి

మంగపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లూరు లక్ష్మీనరసింహ స్వామిని పిక్సల్ ఎరా సౌత్ ఇండియా ఏఐ కంపెనీ ప్రతినిధి కుషాల్ సోని తన మిత్రులతో కలిసి దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ, విశ్రాంత అర్చకుడు కైంకైర్యం రాఘవాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వెంకటనా రాయణశర్మ, అనిపెద్ది మురళీకృష్ణశర్మ, పవన్‌కుమారాచార్యులు పాదారంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుషాల్ సోని మాట్లాడుతూ కంపెనీ పర్యటనలో భాగంగా హైదరాబాద్ వస్తుండగా సోషల్ మీడియా ద్వారా ఈ ఆలయ విశిష్టతను తెలుసుకుని దర్శించుకోవడానికి వచ్చానని తెలిపారు. ఆయన వెంట మల్లూరు గుట్ట మాజీ చైర్మన్ పూజారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో కుషాల్ సోని

రాయినిగూడెం సీలింగ్ భూములు గిరిజనులకు ఇవ్వాలి

ఏటూరునాగారం రూరల్, జూలై 14, (ఆంధ్రజ్యోతి) : రాయినిగూడెంలోని సీలింగ్ భూములను అర్హులైన గిరిజనులకు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో పీవో చిత్రామిశ్రాను కలిసి సోమవారం వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్లగా ములుగు జిల్లా రాయినిగూడెంలోని సర్వే నం 111, 112లో 30 మంది గిరిజనులు కాస్తులో ఉన్నారని, గతంలో మూడో విడత భూ పంపిణీ కార్యక్రమంలో ఐదుగురికి పట్టాలు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఓ వ్యక్తి ఆ భూమి తనదని రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. గతంలో పనిచేసిన పీవో అంకిత్ కూడా ఆ భూములకు ఆ వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారని అన్నారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు తవిటి నారాయణ, వట్టం సమ్మయ్య, చెరుకుల రాజన్న, కుర్ర రాజు, ఆగబోయిన పోతయ్య, లక్ష్మి, సారక్క, సుగుణ తదితరులు ఉన్నారు.

టీడీపీ మండల అధ్యక్షురాలిగా విజయ



మంగపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా గంగపురి విజయను నియమించారు. పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ కొండపెల్లి రాంచందర్‌రావు నియమకాపు పత్రాన్ని సోమ వారం జారీ చేశారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ టీడీపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

వెంకటాపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి మాడూరి శైలజ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతువేదికల్లో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సోమవారం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తనకున్న వ్యవసాయ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, భూమి విస్తీర్ణం రకం, పండిస్తున్న పంటలు, ఆధార్ నంబర్‌తో లింకు ఉన్న మొబైల్ నంబర్ వంటి పూర్తి వివరాలు తమకు అందజేస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు.

వెంకటాపూర్‌లో వైద్య శిబిరం

వెంకటాపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తొమ్మిదో వార్డులో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా మండలంలోని అటవీ ప్రాంతంలో నివసిస్తున్న బండ్లపాడు గొత్తికోయగూడెంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ చందన గూడెంవాసులు 42మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరాల్లో వైద్యసిబ్బంది పుష్పారెడ్డి, అనురాధ, స్వప్న, ఆశా కార్యకర్తలు సరోజన, మాధవి, కవిత, ఇంద్రజ, సంపూర్ణ, సౌజన్య, శోభ, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఏటూరునాగారం రూరల్, జూలై14(ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరాజుపల్లి గ్రామానికి చెందిన తాటి కృష్ణంరాజు(35) కొన్ని రోజులుగా మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం మృతుని బార్య ఆదిలక్ష్మి ఇలా ప్రతిరోజు మద్యం తాగడమేంటనీ ప్రశ్నించడం జరిగింది. దీంతో ఇంట్లో ఎవరి లేని సమయంలో మద్యం తాగిన మైకంలో అతడు పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెంది ఉన్నాడు.

వినతులపై సత్వరమే స్పందించాలి

అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులపై సత్వరమే స్పందిస్తూ సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యమనే దృష్టితో ప్రతి దరఖాస్తుదారులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజావాణిలో 58 దరఖాస్తులు వచ్చాయి. ఈకార్యక్రమంలో ఆర్డీవో రవి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి సింగరేణి కార్మికుడికి గాయాలు

కృషకాలనీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి సింగరేణి కార్మికుడికి గాయాలైన ఘటన మంజూర్‌నగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని సుభాష్‌కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు నేలి రాజ్‌కుమార్ పని నిమిత్తం 8 ఇన్‌క్లైన్ వైపు వెళ్లి తిరిగి భూపాలపల్లికి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. సింగరేణి ఏరియా ఆస్పత్రి పక్కన రోడ్డు నుంచి భూపాలపల్లి వైపు టర్న్ తీసుకుంటుండగా బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న టాటా ట్రాలీ వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో కిందపడిపోగా తలకు తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే అతడిని వంద పడకల ఆస్పత్రికి తరలించారు.

'బహు జనగణమన' పుస్తకాల ఆవిష్కరణ

కాటారం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు, పలు ప్రజా సంఘాల నేతలతో కలిసి ప్రముఖ రచయిత జూలూరి గౌరిశంకర్ రచించిన 'బహు జనగణమన' పుస్తకాలను ఆవిష్కరించారు. బహుజనులు కొన్ని దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందులను కళ్లకు కట్టినట్లుగా గౌరీశంకర్ పుస్తకం రచించారని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, బీఆర్ఎస్ నేత జక్కు శ్రావణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఊర వెంకటేశ్వర్‌రావు, పంతకాని సడువలి, వెంకటస్వామి, రాజేంద్రచారి సంతోష్, శ్రీలక్ష్మి, శ్రీశైలం, బాలరాజు, మున్నా, అశోక్, మనోహర్, తిరుపతి, స్వామి, జమీర్, సుధాకర్, రజాకర్, మొండయ్య, వంశీ, రాజమౌళి, రాజు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

• మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొయ్యూర్‌లో బీఆర్ఎస్ నాయకులు కొమురం భీమ్ విగ్రహం వద్ద జూలూరి గౌరీశంకర్ రచించిన బహుజనగణమన పుస్తకాన్ని ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు యాదగిరిరావు, తాజోద్దీన్, సమ్మయ్య నాయక్, రమేష్, సమ్మయ్య, ఆయూబ్‌ఖాన్, సతీష్ నాగేశ్వర్‌రావు, రాజేశ్వర్‌రావు, పురుషోత్తం రావు, వెంకట్‌రాజు, సతీష్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడిగా సమ్మయ్య

మహదేవపూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి) : వికలాంగుల హక్కుల పోరాట సమితి మహదేవపూర్ మండల అధ్యక్షుడిగా వీరగంటి సమ్మయ్య నియమితులైనట్లు జిల్లా అధ్యక్షుడు వంశీగౌడ్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఈఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా చిటికేసి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కొమురమ్మ, కార్యదర్శిగా చేకుర్తి రాజబాబు, కోశాధికారిగా చింతకుంట నాగమణి, ప్రచార కార్యదర్శిగా చిటికేసి చంద్రమోహన్‌లు నియమితులయ్యారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

వెంకటాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొక్కాల గ్రామ సమీపంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా మావోయిస్టు ఆత్మపరిరక్షణ ప్రజాఫ్రంట్ పేరుతో సోమవారం పోస్టర్లు వెలిశాయి. 'మావోయిస్టు అగ్ర నాయకుల్లారా ఇప్పటికైనా కాలంచెల్లిన 40ఏళ్ల సిద్ధాంతాలను వీడి కాలానుగుణంగా మారిన ప్రజల జీవనవిధానంలో పాత్రులు కావాలి' అని పేర్కొన్నారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులకు వ్యతిరేకంగా మండలంలో ప్రధాన కూడళ్లలో పోస్టర్లు వెలిసాయి. మండల కేంద్రంతో పాటు జగన్నాథపురం వైజంక్షన్, పేరూరు, ధర్మవరం, చెరుకూరు, ప్రగళ్లపల్లి తదితర గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు వాటిని అంటించారు. మావోయిస్టు ఆత్మపరిరక్షణ ప్రజాఫ్రంట్ పేరుతో ఇవి వెలిశాయి.

• వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): 'సిద్ధాంతం కోసం అడవిబాట పట్టిన అన్నలారా, అక్కలారా జనజీవన స్రవంతిలోకి రండి' అని గొత్తికోయగూడాల్లో ఆదివారం అర్ధరాత్రి మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాఫ్రంట్ పేరుతో పోస్టర్లు వెలిశాయి. .మండలంలోని బండ్లపహాడ్, తొర్రిచింతలపాడు, చాకలిరేవు, ఊట్లు, తదితర గొత్తికోయగూడాల్లో వీటిని అంటించారు. 'మావోయిస్టు అగ్ర నాయకుల్లారా.. ఇకనైనా మీ కాలంచెల్లిన సిద్ధాంతాన్ని వీడి కాలానుగుణంగా మారిన ప్రజల జీవనవిధానంలో పాత్రులుకండి' అని పేర్కొన్నారు.

బోల్తాపడిన కారు.. మద్యం లభ్యం!

మహదేవపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద సోమవారం సాయంత్రం కారు అదుపుతప్పి బోల్తాపడింది. మహారాష్ట్ర నుంచి తెలంగాణ వైపు వస్తుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న పత్తిచేలల్లోకి దూసుకెళ్లింది. ఆసమయంలో కారులో రూ.50వేల విలువ చేసే దేశీదారు (మద్యం) ఉన్నట్లు తెలిసింది. ఈప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగనప్పటికీ కారులో దేశీదారు ఉండటంతో ఆ వ్యక్తి పరారైనట్లు సమాచారం. ఆ వ్యక్తి పరారు కావడంతో స్థానికులు మద్యాన్ని తీసుకెళ్లినట్టు తెలిసింది.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా

ఏటూరునాగారం రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సమస్యలను సెక్టార్ అధికారులు పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆమె గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 40 మంది తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. వెంకటాపురం, ములుగు, గంగారం, గోవిందరావుపేట, మంగపేట, మహబూబాబాద్, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, వాజేడు, ఖానాపురం, తాడ్వాయి తదితర మండలాల నుంచి గిరిజనులు తరలివచ్చి సమస్యలను విన్నవించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు, ఉద్యోగావకాశాలు, సీఆర్టీల నియామకం, గురుకుల పాఠశాలల్లో సీట్లు, పెసా గ్రామ సభల నిర్వహణ తదితర సమస్యలపై వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా సెక్టోరియల్ అధికారులతో పీవో మాట్లాడుతూ గిరిజన దర్బార్‌లో వచ్చిన వినతులపై దృష్టి పెట్టి ఆయా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో రాజ్‌కుమార్, ఎస్‌వో సురేష్‌బాబు, పెసా కో ఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో

రోగ నిర్ధారణ సులభతరం

(5వ పేజీ తరువాయి)

పాటు సిటి స్కాన్‌ను కూడా సీఎంతో ప్రారంభించేందుకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ఫలించిన కలెక్టర్ కృషి

భూపాలపల్లి నీతిఆయోగ్ అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఒకటిగా ఉండటంతో ప్రముఖ కార్పొరేట్ కంపెనీల సీఎస్ఆర్ నిధులను జిల్లాకు రాబాట్టేందుకు కలెక్టర్ రాహుల్ శర్మ ప్రయత్నిస్తున్నారు. ఇటీవలే జీజీహెచ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ సీఎస్ఆర్ నిధుల నుంచి వెంటిలేటర్లను ఏర్పాటు చేయించారు. ఇప్పుడు ఈసీఎల్ సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ. 4కోట్లతో సిటి స్కాన్ యంత్రాన్ని జీజీహెచ్‌లో ఏర్పాటు చేసేలా ఆ సంస్థను ఒప్పించగలిగారు. దీంతో పాటు ప్రతి మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రుల్లో ఎంఆర్ఐ సేవలు కచ్చితంగా ఉండాల్సిందేననే నిబంధనలు ఉండటంతో రానున్న రోజుల్లో జీజీహెచ్‌లో అది కూడా వినియోగంలోకి రానుంది. కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సైతం జీజీహెచ్‌లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు రాబడుతున్నారు. ఇటీవలే ఎమ్మెల్యే ప్రభుత్వ పెద్దలను ఒప్పించి ప్రభుత్వం నుంచి మరో సిటి స్కాన్‌ను కూడా జిల్లాకు మంజూరు చేయించినట్లు సమాచారం.

కవిత దిష్టిబొమ్మ దహనం


కవిత దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మల్లన్న టీం సభ్యులు

-భూపాలపల్లిటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ చానెల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆయన టీం సభ్యులు భూపాలపల్లిలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మను అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. సందర్భంగా తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ ఇటీవల బీసీల కోసం తీన్మార్ మల్లన్న ఒక కొత్త పార్టీ పెడుతున్నట్లు ప్రకటించారన్నారు. ఇది తట్టుకోలేని కల్వకుంట్ల కవిత దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ దాడిని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు ఖండించాలని కోరారు. అనంతరం కవితపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ టీం సభ్యులు కరుణాకర్, సతీష్, సంతోష్, చంద్రశేఖర్, శ్రీకాంత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.